తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# 'వాత్సల్యలో భాగం

గాజుల గౌరీప్రసాద్



ఆరోజు ఆదివారం. అంతా బయట హాల్లో కూర్చొని కబుర్లు చెప్పకుంటూ వేరుశనక్కాయలు తింటున్నాం. జూనియర్ లాయర్ గా చేస్తున్న మా తమ్ముడు ఈమధ్యనే వాళ్ళు టేకప్ చేసిన ఒక కొత్త కేసు గురించి చెప్పాడు.

ఏదో అన్నాతమ్ముళ్ళ గొడవట. ఇద్దరికీ పడక తండ్రి, ఆ ఇద్దరు కొడుకులూ ఆస్తి భాగాలేసుకుంటున్నారట. తాతల కాలంనాటి ఇంటిని మూడు వాటాలు చేసేసుకుని తలా ఒక ఇంట్లో కాపురం మొదలెట్టారట. ఒకరోజు తమ్ముడు వూళ్ళో లేడట. తోడి కోడళ్ళిద్దరూ ఏదో అనుకుని మాటామాటా పెరిగి చేతల దాకా వచ్చిందట. వాళ్ళిద్దరూ అలా సిగపట్లలో వుండగానే అన్నగారు బయటనుండివచ్చి తానూ రంగంలోకి దూకాడట. భార్యాభర్తలిద్దరూ కలసి చిన్న కోడల్ని ఎడాపెడా వాయించేశారట. ఒకరికిద్దరయ్యే సరికి చిన్న కోడలు కాస్త భయపడి మామగారి వాటాలోకి పరిగెత్తిందట. కాని- గొడవ మొదలవ్వగానే తలనెప్పి భరించలేక ఆ పెద్దాయన తలుపుగడేసుకునికూర్చుండి పోయాడట. చిన్న కోడలెంత అరచినా తలుపు తియ్యలేదట. ఇంకేముంది. చుట్టుపక్కల వాళ్ళు వచ్చి కలగజేసుకునే లోపలే చిన్న కోడలు కాస్త స్పృహ తప్పి పడిపోయిందట. అంతా కలిసి ఆస్పత్రికి తీసుకెళితే ఆ అమ్మాయి భర్త వచ్చేదాకా వుండి అంతా ఆయన చెవినపడేసి అక్కడే ప్రాణం విడిచిందట. అది భరించలేని తమ్ముడు తన

తండ్రి సమయానికి తలుపు తీసివుంటే తన భార్య రక్షింపబడి వుండేదని, అందువల్ల పరోక్షంగా ఆయనక్కూడా ఈ హత్యలో భాగముందని పోలీసుకంప్లెయింట్ ఇచ్చాడట, తండ్రి అన్న కనికరం కూడా లేకుండా. ఇప్పుడు ఆ ముగ్గురూ జైల్లో వున్నారట. కోర్టులో కేసు నడుస్తోందని ....ఇంకా ఏవేవో వివరాలు చెబుతున్నాడు.

ఇంతలో- మా నాలుగేళ్ళ బేబి హడావుడిగా బయటనుండి పరిగెడుతూ వచ్చి మా కుర్చీల వెనుక నిలబడింది. మాటలాపేసి అంతాతలుపు వైపు చూశాము- ఒక చిన్న కుక్కపిల్ల "కుయ్, కుయ్" అని అరుస్తూ చాలా కష్టపడి మెట్లెక్కి ఇంట్లోకి పరిగెత్తుకొచ్చింది. కుక్కపిల్ల తెల్లదే అయినా మట్టీ బురదా కొట్టుకుని చాలా రోతగా వుంది. ఇంట్లోకి వచ్చిందే ఆలస్యం ఇల్లంతా ఇటూ అటూ పరిగెట్టింది. మా తమ్ముడు లేచి దాన్ని బయటికి తోలడానికి ప్రయత్నించాడు. కాని, అది బయటికి వెళ్ళకుండా ఇల్లంతా పరిగెట్టింది. నాకుచాలాచిరాకేసి, లేచి ఒడుపుగా దాన్ని ఎడం చేత్తో పట్టుకుని గడప అవతల వదిలాను. వదిలానో లేదో బాణం లాగా వెనక్కి పరిగెట్టి ఇంట్లోకి జొరబడింది.

ఇంటరెస్టుగావున్నకబుర్లను పాడుచెయ్యటమే కాక మళ్ళీ ఇంత హంగామా చేస్తున్నందుకు చాలా కోపం వచ్చింది నాకు. మళ్ళీ దాన్ని పట్టుకుని గడప అవతలకు విసిరేసి తలుపు లేసేశాను. దానికి చాలా పట్టుదలగా వున్నట్టుంది. తలుపుకవతల "కుయ్, కుయ్"మని అరుస్తూ తలుపు తీసుకుని లోపలికి రావాలని ప్రయత్నిస్తోంది. ఇలా అయితే లాభంలేదని తలుపు లోపల గడియవేసి కూర్చున్నాను.

అప్పటి వరకూ కళ్ళప్పగించి జరుగుతున్న తతంగమంతా గమనిస్తున్న మా బేబి తలుపు దగ్గరగా వెళ్ళి కంతలోనుండి చూస్తూ "డాడీ... కుక్కపిల్ల భయపడుతున్నట్టు వుంది... లోపలికి రానిద్దాం డాడీ..." అని అంది. "బేబీ! అది చాలా రోతగా వుంది... మవ్వీటురా..." అని అనేసి మళ్ళీ కబుర్లలో పడిపోయాను. మా బేబీ బిక్కముఖం వేసుకుని వాళ్ళమ్మ దగ్గిరకెళ్ళి కూర్చుంది. బయట కుక్కపిల్ల "కుయ్,కుయ్" మని అరుస్తూతలుపుతియ్యాలనిప్రయత్నిస్తూనే వుంది.

అయిదు నిమిషాల తరువాత సడన్‌గా కుక్కపిల్ల అరుపు ఆగిపోయింది. ఎవరో గట్టిగా అరుస్తున్నారు-"హేయ్! చా... చా... దొంగ ముండా దాన్ని చంపేస్తున్నావు కదే..." అని. టక్కున లేచి తలుపు తీశాను. ఎదురుగా- మా వీధిలో తిరిగే కుక్క అప్పటిదాకా మా తలుపు దగ్గిర అరుస్తున్న కుక్కపిల్లను నోటితో పట్టుకుని కొరికేస్తోంది. దాని వాడికోరలమధ్య చిక్కుకున్న కుక్కపిల్ల గిజగిజ లాడుతోంది. వెంటనే కర్తవ్యం గుర్తుకొచ్చి చేతికందిన కర్ర తీసుకుని పెద్ద కుక్కని అదిలించాను. అది కుక్కపిల్లనువదల్లేదు సరికదా దాన్ని అలాగే నోట కరచుకుని రోడ్డు మీదకు పరిగెట్టింది.

నేను కూడా దానివెంటే పరిగెట్టాను. నేను వీధి తలుపు దాటి రోడ్డుకొచ్చే సరికి దూరంగా పెద్దకుక్క ముందుకాలితో నోటిని తుడుచుకుంటూ కనిపించింది. దానికి రెండడుగులివతల నేలమీద పడివుంది చిన్న కుక్కపిల్ల. దగ్గిరగా వెళ్ళి చూశాను. దాని కళ్ళు సగం మూసుకుని ఎటో చూస్తున్నాయి. నోరు కొంచెం తీసి వెక్కిళ్ళు పెడుతోంది. ఉండుండి కడుపు ఎగిరి పడుతోంది. అది ప్రాణం పోయేముందు వూపిరి తీసుకోవడానికి ఆ లేత ప్రాణం పడుతున్న యమ యాతన కాబోలు! ఆ స్థితిలో దాన్ని చూడగానే మనసులో ఎక్కడో కలుక్కుమంది. 'భగవాన్! ఆ పెద్ద కుక్కకు భయపడే కాబోలు మా ఇంట్లోకి దూరింది. తనని తాను రక్షించుకోవా లనేనేమో మూసిన తలుపుల్ని కూడా తోసుకుని లోపలికి రావాలని ప్రయత్నించింది. తన మూగ భాషలో రక్షించమని ఎంత మొర పెట్టుకుందో ఆ దేవుడికే తెలియాలి... అప్పుడు దాన్ని ఇంట్లోకి రానిచ్చి ఓ అరగంట తరువాత బయట విడిచుంటే దాని ప్రాణం మిగిలేది కాబోలు... చూస్తూ-చూస్తూఒక మూగజీవి చావుకు కారణ మయ్యానే..! అని బాధపడుతూ- కనీసం ఇప్పుడయినా దాన్ని బతికించే ప్రయత్నం చెయ్యాలి అని సిద్దపడి కుక్కపిల్లను చూశాను. దానిలో ఎలాంటి చలనమూ లేదు. ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోగా నిశ్చింతగా నిద్రపోతోంది.

మనసంతా అల్లకల్లోలమై పోయింది. మనసు నిండా సంఘర్షణ. ఎంత దుర్దినం ఈరోజు అని కుక్కపిల్లను చివరిసారిగా చూసి వెనక్కు తిరిగాను. ఎదురుగా మా బేబి నిలబడి వుంది- సూటిగా నా కళ్ళలోకి అదోరకంగా చూస్తోంది. ఎందుకో దాని కళ్ళలోకి సూటిగా చూసే ధైర్యం చాలక తలదించుకుని ముందుకు నడిచాను.

ఆరోజు నుండీ ఇప్పటిదాకా మా బేబి కళ్ళలోకి సూటిగా చూడాలంటేనే భయం. ఎందుకంటే ఎప్పుడు చూసినాఆకళ్ళు '...కుక్కపిల్ల హత్యలో నీకూ భాగం వుంది ' అని నిలదీస్తున్నట్టే వుంటాయి నాకు. ●



ప్రభువు జన్మించిన ఆనందం
చిత్రం: పి.పి. నాయుడు, నాగూరు

* * * * * * * * * * * * * * * * * * *

## క్రీస్తు జన్మించిన వేళ...!

పశువుల శాలలో
క్రీస్తు జన్మించిన వేళ
దిగివచ్చె దేవదూత
దివి నుండి భువికి

బోధించె పశుకాపరులకు
ఇది శుభ సమయమని
సంతోషకర వార్తయని

ఆశించె ప్రజలలో
శాంతి వర్ధిల్లాలని
ప్రేమానురాగాలు ఇనుమడించాలని
ఇంతలో—
తళుక్కున మెరిసింది
గగన వీధిలో ఓ తార
అందరూ దీవించారు ఏసును మనసార

— శర్మ సి హెచ్.